www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 20 సెప్టెంబరు 2024

చేనేత సహకార సంఘాల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో నూతన చేనేత సహకార సంఘాల ఏర్పాటుకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖాధికారి ఎస్.రఘునంద ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత వృత్తి చేస్తూ వ్యక్తిగతంగానూ, మాస్టర్ వీవర్స్ కింద పని చేస్తున్న చేనేత సహకార సంఘాలు ఏర్పాటు చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిందని పేర్కొన్నారు. ఈ మేరకు కొత్తగా చేనేత సహకార సంఘాల ఏర్పాటుకు దరఖాస్తులు కోరుతున్నామని తెలిపారు. చేనేత కార్మికులు ప్రభుత్వం అందించే రాయితీలు పొందేందుకు చేనేత సహకార సంఘాలుగా ఏర్పాటై ఉండాలని పేర్కొన్నారు. సంఘాల ఏర్పాటుకు కనీసం 30 మంది సభ్యులు ఉండాలని, ఒక్కో సభ్యునికి కనీస షేరు ధనం రూ.వెయ్యి, ప్రవేశ రుసుం రూ.30 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తులను ఏలూరులోని టిటిడి కార్యాలయం వద్ద ఉన్న జిల్లా చేనేత, జౌళి శాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

స్వీపర్లపై చిన్న చూపు..!

స్కూల్ స్వీపర్లకు ఆరు నెలలుగా అందని జీతాలు

రెండు జిల్లాల్లో మూడు వేల మందికిపైగా ఆయాలు

దాదాపు రూ.పది కోట్ల మేర జీతాల బకాయి

ఉదయ నుంచి సాయంత్రం వరకూ పనిచేస్తే

ఇచ్చేది రూ.ఆరు వేలే

ఆ కొద్దిపాటి జీతమూ సకాలంలో ఇవ్వని దుస్థితి

ఏలూరు కలెక్టరేట్ వద్ద జీతాల కోసం ఆందోళన చేస్తున్న స్వీపర్లు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వ స్కూళ్లలో పని చేసే ఆయాల(స్వీపర్లు)ను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. రోజంతా పనిచేస్తే కనీస వేతనం ఇవ్వని పరిస్థితి ఓపక్క, ఇచ్చే కొద్దిపాటి వేతనమూ సకాలంలో ఇవ్వని పరిస్థితి మరోపక్క నెలకొంది. స్కూళ్లలోని ఆయాలకు ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. దీంతో తమకు వేతనాలు చెల్లించండి మహాప్రభో అంటూ ఆయాలు ఆందోళన బాటపట్టిన పరిస్థితి నెలకొంది. ఏలూరు జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్లలో 1,866 మంది ఆయాలు పని చేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోనూ అదేస్థాయిలో ఆయాలు పని చేస్తున్నారు. రెండు జిల్లాల్లో దాదాపు మూడు వేల మందికిపైగా ఉన్న ఆయాలకు గడిచిన ఆరు నెలలుగా వేతనాలను ప్రభుత్వం ఇవ్వడం లేదు. మూడొందల మంది విద్యార్థులకు ఒకరు చొప్పున స్కూళ్లలో ఆయాలు పని చేస్తారు. ఉదయం ఎనిమిది గంటలకు స్కూల్‌కు వస్తారు. మరుగుదొడ్లు శుభ్రం చేసి స్కూల్ గదులన్నీ శుభ్రం చేయాలి. రోజుకు కనీసంగా నాలుగుసార్లు మరుగుదొడ్లలను శుభ్రం చేస్తారు. సాయంత్రం వరకూ స్కూళ్లలోనే ఉంటారు. అటెండర్లు లేని స్కూళ్లలో ఆయాలతోనే ఆ పనీ చేయిస్తున్న పరిస్థితి ఉంది. వీరికి నెలకు ఇచ్చే వేతనం రూ.ఆరు వేలు మాత్రమే. ఆదివారం మినహా ఎటువంటి సెలవులూ ఉండవు. ఏప్రిల్, మే నెలల్లో సగం జీతమే ఇస్తారు. రోజంతా కష్టపడుతున్నా ప్రభుత్వం ఇచ్చే వేతనం రోజుకు రూ.200 మాత్రమే. ఆయాలు ఒక్కరోజు సెలవు పెట్టినా మరుగుదొడ్ల పరిస్థితి అధ్వానంగా మారుతోంది. స్కూళ్ల నిర్వహణలోనూ ఆయాలు కీలకపాత్ర పోషిస్తున్నారు. వీరు లేకపోతే మరుగుదొడ్లు శుభ్రం చేసేవారే ఉండరు. స్కూళ్లలో అనారోగ్య సమస్యలు తలెత్తే పరిస్థితి ఏర్పడనుంది. ముఖ్యమైన పారిశుధ్య పనులు చేస్తున్న ఆయాల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. మార్చి 22న వీరికి వేతనాలు జమ చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ మళ్లీ వేతనాలు ఇవ్వలేదు. ఒక్క ఏలూరు జిల్లాలోనే దాదాపు రూ.ఐదు కోట్ల మేర బకాయి ఉంది. రెండు జిల్లాల్లో రూ.పది కోట్ల వరకూ ఆయాలకు వేతనాల బకాయి ఉంది. తమకు వేతనాలు వెంటనే జమ చేయాలని కొద్దిరోజులుగా ఆయాలు అనేక ఆందోళనలు నిర్వహిస్తూ అధికారులను కలుస్తున్నారు. అదిగో..ఇదిగో అనడం మినహా వేతనాలు మాత్రం జమకావడం లేదు. దీంతో ఆయాల కుటుంబాలు ఆర్థికంగా నలిగిపోతున్నాయి. ఒకొక్కరికి రూ.36 వేలు వరకూ రావాల్సి ఉంది. నిరుపేద కుటుంబాలకు చెందిన ఆయాలకు ఇది చాలా పెద్దమొత్తమని చెప్పొచ్చు. ప్రభుత్వం వెంటనే ఆయాలకు వేతనాలు చెల్లించాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

స్వీపర్లకు అత్యంత దారుణంగా వేతనాలు

ప్రభుత్వ స్కూళ్లలో పని చేసే ఆయాలకు జీతాలు అత్యంత దారుణంగా ఇస్తున్నారు. మరుగుదొడ్లను శుభ్రం చేయడం అనేది చాలా కష్టమైన పని. ఈ పనికి త్వరగా ఎవరూ ముందుకు రారు. సేవాభావంతో వస్తున్న వారికి కనీస వేతనం కూడా ఇవ్వడం లేదు. వ్యవసాయ పనులకు వెళ్తే నాలుగైదు గంటల్లోనే రూ.ఐదు వందల కూలి వస్తోంది. ఆయాలకు మాత్రం రోజంతా పని చేసినా రోజుకు రూ.200 మాత్రమే ఇస్తున్న పరిస్థితి ఉంది. వీళ్లులేకపోతే స్కూళ్లలో మరుగుదొడ్ల పరిస్థితి ఏమిటో ఆలోచించడానికే భయం పుడుతోంది. గత ప్రభుత్వం అమ్మఒడి సొమ్ములో ప్రతి విద్యార్థి నుంచి రూ.రెండు వేలు తీసుకుని ఆయాలకు జీతాలుగా ఇచ్చేది. ఈ ప్రభుత్వం ఆయాలకు జీతాలు ఏవిధంగా చెల్లిస్తుందో వేచిచూడాలి. కూటమి ప్రభుత్వం ఆయాల జీతాల పట్ల పునరాలోచించాలని వారంతా కోరుతున్నారు. కనీస వేతనం అందించేలా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం..

దుర్గ, స్కూల్ ఆయా, ఏలూరు

మార్చి 22 తర్వాత ఇప్పటి వరకూ జీతాలు అందలేదు. అధికారులను అనేకసార్లు కలిశాం. రెండు రోజుల్లో జమవుతాయని చెబుతున్నారే తప్ప జమ కావడం లేదు. జీతాలు అందక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే జీతాలు జమ చేయాలని కోరుతున్నాం. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పని చేస్తే రూ.ఆరు వేలు వేతనం ఇస్తున్నారు. వేతనాలు పెంచాలని కోరుతున్నాం.

ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే ఎలా

అనంతలక్ష్మి, స్వీపర్, ఉంగుటూరు మండలం

ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే కుటుంబం ఎలా బతకాలి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పని చేస్తున్నాం. ఇచ్చే కొద్దిపాటి జీతం సకాలంలో ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వెంటనే జీతాలు విడుదల చేయాలి.

ఈ రోజో.. రేపో జమ కావడం ఖాయం

అబ్రహం, డిఇఒ, ఏలూరు

స్కూల్ ఆయాల వేతనాలకు సంబంధించిన ప్రక్రియ అంతా మూడురోజుల క్రితమే పూర్తి చేసి ట్రెజరీకి పంపించాం. ఈ రోజు..లేకపోతే రేపో వేతనాలు జమవుతాయి. ఆగస్టు వరకూ పెండింగ్ వేతనాలు ఇవ్వడం జరుగుతోంది. ఆయాలు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు.

నేటి నుంచి సులభంగా ఇసుక బుకింగ్

రవాణా, నిర్వహణా ఖర్చులు మాత్రమే చెల్లించాలి - కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ఉచితంగా ఇసుక పొందడానికి ప్రజల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఎపి శాండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పోర్టల్ రూపొందించిందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉచిత ఇసుక సరఫరాకు సంబంధించిన అంశాలను జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి ఆమె వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఇసుకను పూర్తిగా ఉచితంగా ప్రజలకు అందిస్తామని, అయితే కేవలం రవాణా, నిర్వహణ, నామమాత్రపు లోడింగ్ ఛార్జీలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఇసుక రవాణాకు సంబంధించి ఛార్జీలు నిర్ణయించారన్నారు. ఇసుక అవసరమైన వారు ముందుగా ఎపి శాండ్ మేనేజ్‌మెంట్ సిస్టం పోర్టల్‌లో లాగిన్ కావాలని, వినియోగదారులకు అందుబాటులో ఉండే ఇసుక రీచ్‌ల వివరాలు, ఎంత ఇసుక కావాలి అనే వివరాలు తెలిపి మీ ఆర్డర్ పెట్టగానే ఆటోమేటిక్‌గా వినియోగదారులకు వాహనం కేటాయించబడుతుందని వివరించారు. ప్రజలు తమ ఇంటి నుంచి, లేదా సమీపంలోని సచివాలయంలో సైతం ఇసుకను బుకింగ్ చేసుకుని పొందవచ్చన్నారు. ప్రస్తుతం జిల్లాలో మూడు ఇసుక రీచ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇసుక సరఫరాలో ఏదైనా సమస్యలుంటే టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 6025, లేదా 08812-234014 నెంబర్‌కి ఫోన్ ద్వారా తెలుపవచ్చన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మాత్రమే ఇసుక పోర్టల్‌లో ఆర్డరు చేయడానికి అనుమతి ఉంటుందన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యాన నిత్యావసరాల పంపిణీ

సరుకులు అందజేస్తున్న నేతలు

ప్రజాశక్తి - మండవల్లి

ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్న అని మదర్ థెరిస్సా చెప్పిన మాటలను ఆచరణలో పెట్టేందుకు యుటిఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. భారీ వర్షాలు, వరదలకు ముంపుబారిన పడిన ఆనందపురంలో వరద బాధితులకు యుటిఎఫ్ ఆధ్వర్యాన గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తుఫాను ప్రభావంతో కురిసిన భారీవర్షాలకు వాగులు పొంగి కొల్లేరును వరద ముంచెత్తిందన్నారు. కొల్లేరు పరివాహక గ్రామాలన్నీ పూర్తిగా నీట మునిగి రాకపోకలు స్తంభించడంతో ప్రజలు నానావస్థలు పడ్డారన్నారు. వరదల్లో చిక్కుకుని విద్యార్థులు సైతం తీవ్రంగా నష్టపోయారన్నారు. యుటిఎఫ్ ఉపాధ్యాయుల సమస్యలతోపాటు విద్యారంగ సమస్యల పరిష్కారానికీ నిరంతరం పోరాడుతుందని, అలాగే సామాజిక సేవల్లోనూ ముందుంటుందని తెలిపారు. అనంతరం డిఇఒ అబ్రహం చేతుల మీదుగా బాధితులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ-1 డి.రామారావు, ఎంఇఒ-2 రత్నసునాథం, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముస్తఫాఆలీ, రవికుమార్ రుద్రాక్ష, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా కోశాధికారి జివి.రంగమోహన్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు వరప్రసాద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ బి.మోహన్‌రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సిహెచ్.స్వర్ణరేఖ, నేతలు పిచ్చోడు, మండవల్లి కైకలూరు నేతలు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర @ 2047కు ప్రణాళికలు రూపొందించాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా స్వర్ణాంధ్ర-2047 డాక్యుమెంట్‌లో జిల్లాస్థాయి ప్రణాళిక ప్రస్ఫుటంగా ఉండేలా అధికారులు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ అమరావతి నుండి జిల్లా కలెక్టర్లతో స్వర్ణాంధ్ర @ 2047 మండల, జిల్లాస్థాయి ప్రణాళిక రూపకల్పనపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరం నుంచి కలెక్టర్ కె.వెట్రిసెల్వి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మండలస్థాయిలో రూపొందించిన ప్రణాళికలను క్రోడీకరించి జిల్లాస్థాయి ప్రణాళికను అక్టోబరు 15లోగా ప్రభుత్వానికి అందజేయాల్సి ఉందన్నారు. దీనిలో భాగంగా రానున్న ఐదేళ్లలో 2024 నుండి 2029 వరకు ఒక విజన్‌తో కూడిన నివేదిక రూపొందించాల్సి ఉందన్నారు. దీనికి జిల్లాలోని ప్రతి శాఖ ఈ లక్ష్యసాధనలో నిర్ణయాత్మక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. దీనికి ఈ నెల 21 నుండి అక్టోబరు ఐదో తేదీ వరకు నిర్వర్తించాల్సిన కార్యాచరణను వివరించారు. ఎంపీలు, ఎంఎల్ఎలు, జిల్లాస్థాయి ప్రజాప్రతినిధులు, బ్యాంకర్లు, రైతులు, వాణిజ్యరంగం, ఇతర అసోసియేషన్లు తదితరులతో సమావేశాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించాలన్నారు. స్వర్ణాంధ్ర @2047 ప్రాముఖ్యతపై పాఠశాల, ఇంటర్మీడియేట్ తదితర కళాశాలల స్థాయిలో వక్తృత్వ, క్విజ్ పోటీలు, చర్చాగోష్టులు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయితీ స్థాయిలో గ్రామ సభలు నిర్వహించేందుకు సన్నాహాలు చేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, మత్స్య రంగాల్లో ప్రస్తుత విస్తరణ, దిగుబడులు, రానున్న రోజుల్లో అంతర సాగు విధానం, ఆదాయం పెంపు, ప్రకృతిసాగు విస్తీర్ణం పెంపు తదితర అంశాలను ప్రణాళికలో పొందుపర్చాల్సి ఉందన్నారు. పాల ఉత్పత్తి పెంపుదలకు అవసరమైన అంశాలను ప్రణాళికలో పొందుపరచాలన్నారు. పారిశ్రామిక, పర్యాటక, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన వంటి అంశాలను ప్రణాళికలో జోడించాలన్నారు. సమావేశంలో డిఎఫ్ఒలు రవీంద్రదామా, రవిశంకర్, జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, డ్వామా పీడీ ఎ.రాము, డిపిఒ టి.శ్రీనివాస్ విశ్వనాథ్, ఉద్యానశాఖ డిడి రామ్మోహన్, ఎల్‌డిఎం డి.నీలాద్రి, పశుసంవర్ధకశాఖ జెడి జి.నెహ్రూబాబు, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.శర్మిష్ఠ, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ సతీష్, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్ రాజు, ఎపిఎంఐపి పీడీ రవికుమార్, మున్సిపల్ కమిషనర్ ఎన్.భానుప్రతాప్, మత్స్యశాఖ జెడి నాగలింగాచారి, సిపిఒ బి.శ్రీదేవి, డిఇఒ ఎస్.అబ్రహాం, డివైఇఒ ప్రభాకరరావు, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి ఎన్ఎస్.కృపావరం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.బాబ్జి, అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సిఐటియు ఆధ్వర్యాన సరుకుల పంపిణీ

సరుకులు అందజేస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరుఅర్బన్

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన గుడివాకలంక గ్రామంలో బాధితులకు సిఐటియు జిల్లా కమిటీ తరఫున గురువారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. జిల్లాలోని సిఐటియు అనుబంధ సంఘాలు అంగన్వాడీ, ఆశ, భవన నిర్మాణ కార్మికులు, ఫ్యాక్టరీలు తదితర రంగాల్లోని కార్మికుల ద్వారా సేకరించిన సహాయంతో నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బుడమేరు ద్వారా కొల్లేరు ముంపునకు గురై వేలాదిమంది నిరాశ్రయులయ్యారన్నారు. విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇచ్చిన విధంగా రూ.25 వేలు నష్ట పరిహారాన్ని కొల్లేరులో వరద బాధితులకూ అందజేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో నాలుగు మండలాల్లోని ఐదు గ్రామాల్లో సుమారు 700 కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశామన్నారు. వరద నివారణకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరదలు, వర్షాల సమయంలో దళితులు, బలహీనవర్గాలు నివశించే కాలనీలు ముంపునకు గురవుతున్నాయని, దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధితులను పూర్తిగా ఆదుకోవాలని వారు కోరారు. ముంపు శాశ్వత నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ సర్పంచి ఘంటశాల నాగరాజు మాట్లాడుతూ సిఐటియు ఆధ్వర్యాన గ్రామంలోని ప్రజలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కొర్రి విజయలక్ష్మి, అంగన్వాడీ యూనియన్ నేతలు రజిని, భవాని, స్వప్న, లలిత, ఝాన్సీ, వెంకటలక్ష్మి, రాణి, ఆశ యూనియన్ నేతలు జానకి, రమాదేవి, రామతులసి పాల్గొన్నారు.

పామాయిల్ ఫ్యాక్టరీ కాలుష్యాన్ని అరికట్టాలి: సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జంగారెడ్డిగూడెం పామాయిల్ ఫ్యాక్టరీ నుండి వెలువడుతున్న కాలుష్యంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి రక్షణ కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటన విడుదల చేశారు. జంగారెడ్డిగూడెం పామాయిల్ ఫ్యాక్టరీ నుండి బయటికి వస్తున్న వ్యర్థాలు మున్సిపల్ డ్రెయిన్లలో చేరుతున్నాయని, తాగు, సాగునీరు కలుషితం కావడంతో ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా రామచంద్రాపురం, పుట్లగట్ల, ఉప్పరమెట్ట ప్రాంతాల్లో ప్రజలు ఫ్యాక్టరీ ద్వారా వెలువడుతున్న కాలుష్యం వల్ల శ్వాసకోశ వ్యాధులు, ఇతర రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఫ్యాక్టరీ నుండి వెలువడుతున్న భారీ పొగ, చూర్ణం వల్ల ప్రజలతోపాటు మూగజీవాలు, వ్యవసాయ భూములు కలుషితమవుతున్నాయని పేర్కొన్నారు. ఫ్యాక్టరీ నుండి వస్తున్న వ్యర్థాలను ప్లాంట్ల ద్వారా శుద్ధి చేయకుండా వర్షాకాలంలో వర్షపు నీటితోపాటు వదిలేస్తున్నారని తెలిపారు. ఫ్యాక్టరీ నుండి వస్తున్న వ్యర్థాలతో రామచంద్రపురం ట్యాంకులో తాగునీరు నల్లగా మారి కలుషితమై చిన్న పిల్లలకు లివరు, టిబి వంటి రోగాలు సోకుతున్నాయని పేర్కొన్నారు. సాయంత్రం మూడు గంటలు దాటిన తర్వాత ఫ్యాక్టరీ నుండి వెలువడుతున్న దుమ్ము, పొగ వల్ల చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, భోజనాలు చేయలేని పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయని తెలిపారు. వెంటనే కార్మిక, కాలుష్య నివారణ శాఖ, వాతావరణ పరిరక్షణ కమిటీ, ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని జంగారెడ్డిగూడెం పామాయిల్ ఫ్యాక్టరీ ద్వారా వెలువడుతున్న కాలుష్యాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. ప్రజల తాగునీరు, పంటల సాగునీరు, గాలి కాలుష్యం చెందకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

అంతటా పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ

ప్రతిజ్ఞ చేస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ, సిబ్బంది

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రతిఒక్కరూ మనతో పాటు మన ఇంటిని, మన గ్రామాలను, జిల్లాలను, రాష్ట్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అన్నారు. స్వచ్ఛత హి సేవ-2024లో భాగంగా గురువారం పద్మశ్రీ చీపురు పట్టుకుని స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. అనంతరం జెడ్‌పి కార్యాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా గంటా పద్మశ్రీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిశుభ్రత కోసం ప్రతిరోజూ కొంత సమయాన్ని కేటాయించాలని, అలా చేసిన నాడే మన గ్రామం నుంచి రాష్ట్రం వరకు పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్‌ను సాధించగలమని అన్నారు. దానికి అందరూ ముందడుగు వేసి ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశంలో మొదటిస్థానంలో ఉండేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, డిప్యూటీ సిఇఒ ఎస్.నిర్మల జ్యోతి, జెడ్‌పి సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీకి సంబంధం లేని వ్యక్తుల పెత్తనంతో..

వైసిపి ఘోర పరాజయం

జగన్ ఇచ్చిన రూ.30 కోట్లు నొక్కేసారు

ఇక నుంచి ప్రశ్నిస్తా.. నిలదీస్తా..

మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గానికి సంబంధంలేని వ్యక్తులు పాలకొల్లులో పెత్తనం చేయడం వల్ల పాలకొల్లుతోపాటు జిల్లాలో వైసిపి ఘోరంగా ఓడిపోయిందని మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు విమర్శించారు. వైసిపి అధిష్టానం శేషుబాబును పార్టీ నుంచి బహిష్కరించినట్లు వచ్చిన వార్తలపై ఆయన స్వగృహం వద్ద కుటుంబ సభ్యులతో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి ఈ ఎన్నికల్లో రూ.30 కోట్లు ఆ వ్యక్తికి ఖర్చులకు ఇవ్వగా ఆయన ఖర్చు పెట్టకుండా వైసిపి నేతలను, కార్యకర్తలను ఏడిపించి ఫోన్ కట్టేసి పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడ్డాడని తెలిపారు. అతనిని ముందుగా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ అటువంటి వారి చెప్పుడు మాటలకు ప్రాధాన్యతిస్తోందన్నారు. తాను క్యాబినెట్ హోదా గల జెడ్‌పి ఛైర్మన్ పదవికి రాజీనామా చేసి వైసిపికి తొలి ఎంఎల్‌సిని అందించానని గుర్తు చేశారు. 2014, 2024 ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారి వల్ల జిల్లాల్లో వైసిపి ఘోరంగా ఓడిపోయిందని చెప్పారు. పార్టీ నిజమైన నేతలను పక్కన పెట్టి పికె, వైకె టీంలను నమ్మి నాశనం చేసిందని చెప్పారు. నియోజకవర్గానికి ఇతర చోట్ల నుంచి నేతలను తీసుకొచ్చి పదవులు ఇచ్చిందని, పాలకొల్లులో మొలతాడు కట్టిన మగవారు లేరా అని ప్రశ్నించారు. గతంలో గుణ్ణం నాగబాబుకు ఇలాగే చేశారని చెప్పారు. పార్టీ కోసం పనిచేసిన బిసి నేత అని కూడా చూడకుండా ఇలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు అన్యాయం చేసిన వారిని ప్రశ్నిస్తానని హెచ్చరించారు. శేషుబాబు కుటుంబం వైఎస్ఆర్‌కు విధేయులై ఉన్నారని, అందుకు సొంత సొమ్ము కోట్లు ఖర్చు చేశారని శేషుబాబు భార్య ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశం అనంతరం శేషుబాబు అనుచరులు ఆయన కార్యాలయంలోని వైసిపి జెండాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు చింపేసి నిప్పంటించారు. తన అనుచరులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయం ప్రకారం భవిష్యత్తులో నడుచుకుంటానని శేషుబాబు ప్రకటించారు. కార్యక్రమంలో పలువురు వైసిపి నేతలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి రవిచంద్ర

దొంగనోట్ల ముఠా అరెస్టు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో దొంగనోట్లు (చిల్డ్రన్స్ కరెన్సీ) మార్పిడికి పాల్పడుతున్న ఐదుగురు ఘరానా మోసగాళ్లను పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. జంగారెడ్డిగూడెం డిఎస్‌పి యు.రవిచంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం సిఐ వి.కృష్ణబాబు పర్యవేక్షణలో ఎస్ఐ షేక్ జబ్బీర్, సిబ్బందితో కలిసి జంగారెడ్డిగూడెం పరిసర ప్రజలకు అసలు కరెన్సీకి బదులు నకిలీ కరెన్సీ నోట్లు మూడు రెట్లు ఎక్కువ ఇస్తామని ఆశ చూపి మోసాలకు పాల్పడుతున్న ముఠాను ఈ నెల 18వ తేదీ బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక మార్కెట్ యార్డు సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.40 వేలు అసలు కరెన్సీ (500 నోటు), రూ.రెండున్నర లక్షల నకిలీ నోట్లు, ఒక కారు, ఒక బైకును స్వాధీనం చేసుకున్నారు. ముఠాలో జంగారెడ్డిగూడెంలోని ఉప్పలమెట్టకు చెందిన బర్రె సుధీర్, టి.నర్సాపురం మండలం అప్పలరాజుగూడేనికి రెందిన చెట్ల నాగరాజు, అప్పలరాజుగూడేనికి చెందిన నెడుసు గంగాధర్, జంగారెడ్డిగూడెం మండలం పేరంపేటకు చెందిన ఏలేటి చంద్రశేఖర్, వేగవరానికి చెందిన భోగిరాల బాలులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం డిఎస్‌పి యు.రవిచంద్ర మాట్లాడుతూ ప్రజలు దొంగనోట్ల ముఠా పట్ల అవగాహన కలిగి ఉండాలని, లోన్ యాప్‌ల జోలికి వెళ్లొద్దని సూచించారు. ఈ కేసులో నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సిబ్బంది సిహెచ్.శ్రీనివాసరెడ్డి, చవల సత్యనారాయణ, ఉప్పులూరి రవికుమార్‌లను ఆయన అభినందించారు.

వాటర్ ట్యాంక్ ఏర్పాటు అభినందనీయం

ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్



ట్యాంక్ ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రజలకు ఉపయోగపడేలా వాటర్‌ట్యాంక్ ఏర్పాటు అభినందనీయమని ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని ప్రగడవరం పంచాయతీ పిఇఎఫ్ సంఘ వ్యవస్థాపకులు కీర్తిశేషులు కనిపెడ బ్యూలా నిర్మలకుమారి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో భాగంగా వాటర్ ట్యాంక్‌ను ఎంఎల్‌ఎ చేతుల మీదుగా ప్రారంభించారు. బ్యూలా నిర్మల కుమారి గుర్తుగా శాంతి కపోతాలను పావురాలను ఎగురవేశారు. కార్యక్రమంలో టిడిపి గ్రామాధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి రాజా, బూత్ కన్వీనర్ అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని చింతలపూడి విద్యాశాఖాధికారి కిరణ్‌బాబు అన్నారు. చింతలపూడి మండల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 13 హైస్కూల్స్ మధ్య జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రీడా పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను నిర్వహిస్తుందన్నారు. వాలీబాల్, రన్నింగ్, చెస్, లాంగ్ జంప్, ఇతర పోటీలు జరుగుతాయని, 600 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. మండల స్థాయి పోటీలు పూర్తయిన తర్వాత నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఇటి సుధాకర్, నియోజకవర్గ కన్వీనర్ పిట్టా వేణు, మండల కన్వీనర్ సిమోను పాల్గొన్నారు.

సిపిఎంతో అందరికీ సమన్యాయం

ప్రజాశక్తి - ముసునూరు

పేద, మధ్యతరగతి, దళిత అనే తేడా లేకుండా అందరికీ సమన్యాయం చేసే పార్టీ సిపిఎం అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు అన్నారు. మండలంలోని చింతలవల్లి బిడో సిపిఎం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శి వర్గ సభ్యునిగా కుటుంబరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జి.రాజు మాట్లాడుతూ అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, ఇల్లు లేని దళితులకు ఇంటి పట్టాలు అందించాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని, చింతలవల్లి గ్రామపంచాయితీ పరిధిలో పారిశుధ్య మెరుగుదలకు కృషి చేయాలని, ఇలా పలు అంశాలను సభలో చర్చించారు. ఈ కార్యక్రమంలో పిల్లి మురళి, గంగుల సత్యం, ఆనందరావు, కుటుంబరావు, కె.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీను, ధర్మారావు, రమేష్, శివప్రసాద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అశోక్ శ్రీనివాస్ మృతి తీరని లోటు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ఇటీవల మృతి చెందిన మేడపాటి అశోక్‌శ్రీనివాస్ కుటుంబాన్ని వైసిపి ద్వారకాతిరుమల నాయకులు పరామర్శించారు. అశోక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అశోక్ మృతి వైసిపికి, ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటని, అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించే వారని చెప్పారు. నివాళులర్పించిన వారిలో వైసిపి ద్వారకాతిరుమల నాయకులు అంబటి గాంధీ, ఎంపిటిసి సభ్యులు బుర్ర వెంకట శివాజీ, మండల యూత్ ప్రెసిడెంట్ పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, టౌన్ ప్రెసిడెంట్ అచ్యుత యేసుబాబు, సీనియర్ నాయకులు ఉక్కుర్తి వెంకటరావు, పొనమల ఉమామహేశ్వరరావు, వార్డ్ మెంబర్ దూలపల్లి ప్రసాద్ ఉన్నారు.



రామకృష్ణకు నియామకపత్రం అందిస్తున్న వెంకటలక్ష్మి

వెంకటలక్ష్మిని కలిసిన నాయకులు

ప్రజాశక్తి - దెందులూరు

రెండు రోజుల క్రితం జనసేన పార్టీలో చేరిన దెందులూరు నియోజకవర్గం పైడిచింతపాడు గ్రామానికి చెందిన ప్రస్తుత సర్పంచి, మాజీ ఎంపిటిసి, మాజీ సర్పంచులు, గ్రామ పెద్దలు జనసేన పార్టీ గ్రామ కార్యదర్శి, దెందులూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డాక్టర్ ఘంటసాల వెంకటలక్ష్మిని గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. జనసేన పార్టీలో చేరినందుకు చాలా ఆనందంగా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా జనసేన పైడిచింతపాడు గ్రామ నాయకులు, కార్యకర్తల నిర్ణయం మేరకు ఏకగ్రీవంగా పైడిచింతపాడు గ్రామ జనసేన పార్టీ అధ్యక్షునిగా ఎన్నుకున్న మోరు రామకృష్ణకు వెంకటలక్ష్మి నియామకపత్రం అందించారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్

ప్రజాశక్తి - మండవల్లి

పేదలకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కైకలూరు ఎంఎల్ఎ డాక్టర్ కామినేని శ్రీనివాస్ హెచ్చరించారు. మండవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం పొందేందుకు రోగులు పడుతున్న ఇబ్బందులను గ్రామ ప్రముఖులు గుడివాడ చిట్టిబాబుతో పాటు రోగులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆసుపత్రిలో రోగులకు సరిగా వైద్య సేవలందడం లేదని ఆయనకు తెలిపారు. వైద్యురాలు ఎక్కడ అని ఎంఎల్ఎ ప్రశ్నించగా వైద్యురాలు ఆసుపత్రికి రాలేదని, సమ్మెలో ఉన్నారని సిహెచ్ఒ శ్రీనివాసరావు చెప్పడంతో ఆయన ఒకింత అసహనానికి గురయ్యారు. రోగులకు వైద్యం అందిస్తున్నారా, కక్షపూరిత చర్యలకు పాల్పడుతున్నారా తెలుస్తుందా మీకు అని ప్రశ్నించారు. పేదలకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా తీరు మార్చుకోకుంటే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఆయనతో పాటు మాజీ ఎంఎల్‌సి విఠల్‌రావు, నారగాని వెంకట నాగేశ్వరరావు, సజ్జ సురేష్, బోయిడి సురేష్, ముళ్లపూడి సత్తిబాబు, ఏసుబాబు, కోనపురెడ్డి కోటేశ్వరరావు, మారగాని మురళీకృష్ణ పాల్గొన్నారు

ఫార్మసీ ప్రోగ్రాం ప్రారంభం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం ప్రకాశం డిగ్రీ కళాశాలలో నూతనంగా దానేశ్వరి ఎడ్యుకేషనల్ సొసైటీ పేరుతో ఫార్మసీ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ఇందులో 2024-2025 విద్యాసంవత్సరానికి సంబంధించి వంద మంది విద్యార్థులను చేర్చుకోవటానికి ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పిసిఎల్), రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆమోదం పొందిందని ప్రకాశం విద్యాసంస్థల అధినేత వద్ది జనర్ధారనవరావు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

పాము కాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరుకు చెందిన వల్లూరి ధనలక్ష్మి(47) పాటుకాటుకు గురై చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. వివరాల ప్రకారం... ఈ నెల 18వ తేదీన ధనలక్ష్మి వంటింట్లో ఉండగా పాటు కాటు వేసింది. కుటుంబసభ్యులు ఆమెను వెంటనే చేబ్రోలు పిహెచ్‌సికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి ఏలూరు రిఫర్ చేశారు. ఏలూరు ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం ఉదయం మృతి చెందింది.

తెలంగాణ మద్యం పట్టివేత

కుక్కునూరు :కుక్కునూరు మండల పరిధిలోని అల్లిగూడేనికి చెందిన వడ్డే రాములు అనే వ్యక్తి తెలంగాణ మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ రామకృష్ణ తన సిబ్బందితో కలిసి రాములు ఇంట్లో సోదాలు నిర్వహించారు. అతని వద్ద నుంచి తెలంగాణకు చెందిన 37 మద్యం బాటిళ్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

ముసునూరు :రేకుల షెడ్డు వద్ద వడ్రంగి పనిచేస్తూ ప్రమాదవశాత్తూ జారి కింద పడి తీవ్ర గాయాలపాలైన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెంది. ఈ ఘటనలో మండలంలోని లోపూడిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ముసునూరు మండలంలోని లోపూడి గ్రామానికి చెందిన కొండపర్వ సత్తిబాబు వడ్రంగి మేస్త్రిగా చేస్తున్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామంలో రేకుల షెడ్డు నిర్మాణం పనిలో భాగంగా పనిచేస్తుండగా జారిపడి కింద పడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని కుటుంబసభ్యులు గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

27న ద్వారకాతిరుమలలో రాష్ట్ర రైతు సదస్సు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ఈ నెల 27న ద్వారకాతిరుమలలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర రైతు సదస్సు, 27 నుంచి 29 వరకు రాష్ట్ర రైతు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ చెప్పారు. స్థానిక యుటిఎఫ్ భవనం వద్ద గురువారం నిర్వహించిన రైతు సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 27న ద్వారకాతిరుమలలోని శ్రీకృష్ణ యాదవ కళ్యాణ మండపంలో వ్యవసాయ సంక్షోభం-మద్దతు ధరలు అంశంపై రాష్ట్ర రైతు సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.

పోలీసు లాంఛనాలతో ఎస్ఐ మృతదేహం ఖననం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఎస్ఐ నరసింహరావు మృతదేహానికి పోలీసు లాంఛనాలతో ఖననం జరిగింది. ఏలూరు నగరంలోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న డి.నరసింహరావు అస్వస్థతకు గురై బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లాలోని పలువురు పోలీసు సిబ్బంది, పోలీసు సంక్షేమ సంఘం నాయకులు నరసింహరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం పోలీసు లాంఛనాలతో ఖననం చేశారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - ముసునూరు

ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు గత ఆరు నెలల నుంచి జీతాలు ఇవ్వ డం లేదని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వారికి పెండింగ్ జీతాలు చెల్లించాలని సిఐటియు నాయకులు జి.రాజు కోరారు. మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికు లతో ఆయన మాట్లాడారు. ఈ క్రమంలో వారి జీతభత్యాల విషయాలు, వారి జీతాలు ఆరు నెలల నుఃఒ అందకపోవటం ఇలా పలు సమస్యలు దృష్టికి వచ్చాయని తెలిపారు. సిఐటియు ముసునూరు మండల కార్యదర్శి కె .శ్రీనివాస్ పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని సానారుద్రవరంలో రాష్ట్రీయ రహదారిపై భారీ గుంతలు పడి ప్రమాదాలకు నిలయంగా మారడంతో జనసేన సెంట్రల్ ఆంధ్రా జోన్ కన్వీనర్ నల్లగోపుల చలపతిరావు, ఆంధ్రా తెలంగాణా రాధ రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. స్థానిక ఏడో వార్డు కాలనీ రోడ్డుపైనే వర్షపు నీరు నిలిచిపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీ వాసులు తెలపడంతో, అధికారులతో పాటు కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామని తెలిపారు.

పాఠశాలలో ఆటల పోటీలు

ప్రజాశక్తి - చాట్రాయి

స్వచ్ఛతా హిసేవా కార్యక్రమం వచ్చే నెల రెండో తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎంపిపిఎస్ తుమ్మగూడెం ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంపా వెంకట్రావు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గురువారం ఆటలు, పా టలు, వ్యాసరచన, డిబెటింగ్‌లు , డ్రాయింగ్‌లు నిర్వహించా మని ప్రధానోపాధ్యాయుడు గంపా.వెంకటరావు తెలిపారు.

ఆగిరిపల్లిలో 'స్వచ్ఛతా హి సేవ'

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ప్రజాహిత పర్యావరణాన్ని కాపాడటంలో ప్రతిఒక్కరూ పాటుపడాలని ఆగిరిపల్లి జెడ్‌పిటిసి సభ్యులు పి.వీరబాబు అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆగిరిపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గోళ్ల అనూష, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ అబ్దుల్ సలాం పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - కామవరపుకోట

ఆంధ్రప్రదేశ్ మహిళ సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని వీరిశెట్టిగూడెం అడ్డరోడ్డు సమీపంలోని ఎన్‌టిఆర్ నైపుణ్య అభివృద్ధి మహిళా ప్రాంగణంలో అర్హులైన ఆసక్తి కలిగిన నిరుద్యోగ మహిళలు, యువత, గృహిణిల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ బి.రెబకా శామ్యూల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక నెల కాల వ్యవధిలో అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, ఎంబ్రాయిడరీ (మగ్గం వర్క్) కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కనీస విద్యార్హత ఎనిమిదో తరగతి పాసై 18 నుంచి 40 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్హత, ఆధార్ ధ్రువీకరణ, రేషన్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జత చేసి సమర్పించాలని, 23వ తేదీ నుంచి శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

ఆక్రమణలో అటవీ శాఖ బంగ్లా భూమి

స్థలాన్ని ఆక్రమించుకుని ఏర్పాటు చేసిన కంచె

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని ములగలంపల్లి గ్రామంలో కొన్ని వందల ఏళ్ల క్రితం అటవీశాఖ జంగారెడ్డిగూడెం రేంజ్‌కు సంబంధించి ఓ బంగ్లాను నిర్మించారు. అప్పట్లో అటవీ శాఖ పరిశీలనకు వచ్చే అధికారులు ఈ బంగ్లాలోనే విధులు నిర్వహించేవారు. ఇటీవల కాలంలో జంగారెడ్డిగూడెంలోని నూతన రేంజ్ కార్యాలయ నిర్మాణం చేపట్టడంతో పాటు కార్యకలాపాలు కూడా ఇక్కడి నుంచే జరుగుతుండటంతో, బంగ్లాను పట్టించుకోక అది కాస్త పిచ్చి మొక్కలతో శిథిలావస్థకు చేరింది. అప్పటి నుంచి ఆ బంగ్లాను అటవీశాఖ, రెవెన్యూ, పంచాయతీ శాఖలు చూసీ చూడనట్లు వదిలేశాయి. ఇదే అదునుగా చూసుకొని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బంగ్లా చుట్టూ పక్కల ఉన్న ఖాళీ స్థలాన్ని కొంచెం కొంచెం ఆక్రమించుకోవడం మొదలెట్టాడు. ఆక్రమించుకున్న స్థలానికి చుట్టూ కంచె ఏర్పాటు చేసుకొని, కూరగాయల మొక్కలు నాటి వ్యవసాయం చేస్తున్నాడు. దీనిపై సెక్షన్ అధికారి రాంబాబుని వివరణ కోరగా ఆక్రమణ విషయం తన దృష్టికి వచ్చిందని, బంగ్లా భూమిని సర్వే చేయించి ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.

శశికుమార్‌ను తక్షణమే అరెస్టు చేయాలి

ఎస్‌పికి ఐద్వా వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక దయానంద సరస్వతి ఆశ్రమ హాస్టల్‌లో విద్యార్థినులపై లైంగిక దాడికి పాల్పడ్డ హాస్టల్ వార్డెన్ భర్త శశికుమార్‌ను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్‌కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎపి మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మన్నవ యామిని మాట్లాడుతూ దయానంద సరస్వతి ఆశ్రమ హాస్టల్లో లైంగిక దాడికి పాల్పడ్డ శశికుమార్‌ను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. అదేవిధంగా దయానంద సరస్వతి పేరుతో ఉన్న మిగతా హాస్టళ్లన్నింటినీ పరిశీలించి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. స్త్రీ విముక్తి సంఘటన జిల్లా నాయకులు టి.చిన్ని మాట్లాడుతూ మహిళలపై, విద్యార్థినులపై రోజురోజుకీ అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని, దీనికి కారణమైన విష సంస్కృతిని, మద్యం, మత్తు పదార్థాలను, పోర్న్ సైట్లను నిషేధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు పరకా శ్యామల, పిడిఎస్‌ఒ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎస్.మోహన్, ఎఐఎస్ఎఫ్ నాయకులు ఎం.సాయి, ఎమ్‌డి.సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

తూము ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని ఇనుమూరు సమీపంలో ఉన్న జిన్నెలవాగు చెరువుకు తూము ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇనుమూరు గ్రామంలో ఉన్న జిన్నెలవాగు చెరువును గ్రామస్తులతో కలిసి ప్రజాసంఘాల బృందం బుధవారం పరిశీలించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ కె.రమేష్‌బాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ ఇనుమూరు గ్రామానికి చెందిన జిన్నెలవాగు చెరువుకు తూము లేకపోవడంతో చెరువు నీరు వృధాగా బయటకు వెళ్లిపోతుందన్నారు. ఆయకట్టు రైతులకు పంటల సమయంలో సాగునీరు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ జిన్నెల వాగు చెరువు నిర్మించి 40 ఏళ్లు అయిందని, తూము పాడై ఎనిమిదేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ తూము ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే చెరువుకు తూము ఏర్పాటు చేసి రైతులకు సాగు నీరందించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఐటిడిఎ ఇరిగేషన్ అధికారులకు తెలియజేస్తామని డిప్యూటీ తహశీల్దార్ కె.రమేష్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండలాధ్యక్షులు కారం భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఉడతా వెంకటేష్, గ్రామస్తులు కారం ముత్యాలరావు, కె.లక్ష్మయ్య, శ్రీను పాల్గొన్నారు.

ఇళ్లకు జియో ట్యాగింగ్ నమోదు

ఉంగుటూరు : 2014 - 2019 మధ్య ఇల్లు నిర్మించుకుని బిల్లులు రానివారిని సర్వే చేసి ప్రత్యేక యాప్‌లో వివరాలతో మ్యాపింగ్ చేస్తున్నారు. మండలంలో 795 మంది లబ్ధిదారులు గతంలో ఇళ్ల నిర్మించుకున్నారు. వారందరి ఇళ్లకు ప్రస్తుత పొజిషన్ నిర్ధారించి జియో ట్యాగ్ ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నారు. త్వరలో బిల్లులు రానున్నాయని హౌసింగ్ ఎఇ సురేష్‌బాబు తెలిపారు. మండలంలో ఇప్పటివరకు 200 ఇల్లులు మ్యాపింగ్ పూర్తి చేసినట్లు చెప్పారు. నారాయణపురంలో సప్ప వీరబాబు, నల్ల ఆనంద్, దిడ్ల శ్రీను, కైకరంలో సర్పంచి సలగల గోపీ పాల్గొన్నారు.

విజయవాడ వరద బాధితులకు సాయం

ప్రజాశక్తి - భీమడోలు

తన పిలుపునకు స్పందించి విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు భీమడోలు మండలానికి చెందిన వికలాంగులు ముందుకు రావడం అభినందనీయమని ఎంఎల్ఎ ధర్మరాజు అన్నారు. భీమడోలు కేంద్రంగా పనిచేస్తున్న వికలాంగుల హక్కుల పోరాట సమితి శాఖ సభ్యులు విజయవాడ వరద బాధితులను ఆదుకునేం దుకు రూ.6,100 సమకూర్చారు. ఈ మొత్తాలను బుధవారం ఎంఎల్ఎకు ఆయన కార్యాలయంలో అందించారు.

కొల్లేరు ముంపు బాధితులకు నిత్యావసరాలు

ఉంగుటూరు :కైకలూరు మండలం శృంగవరపాడు, గోకర్ణపురం గ్రామాల నివాసితులకు నిత్యావసర సరుకులు అందించారు. వరదలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయి ఓ దీవిలో ఉంటున్న కొన్ని కుటుంబాలకు కైకరానికి చెందిన నారాయణపురం జెడ్‌పి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గొల్లపల్లి రామారావు తన మిత్ర బృందంతో రూ.30 వేలు విరాళాలు సేకరించారు. వాటితో నిత్యావసర సరుకులు కూరగాయలు, బిస్కెట్లు, ఆహార వస్తువులను పడవల్లో వేసుకుని వెళ్లి అందించారు.

వేలంపాటలో లడ్డూ దక్కించుకున్న పోలీసులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని వై.కూడలి వద్ద ఏర్పాటు చేసిన శ్రీ వినాయక స్వామి వారి నిమర్జన కార్యక్రమం బుధవారం రాత్రితో ముగిసింది. ఈ సందర్భంగా గురువారం కమిటీ నిర్వాహకులు వినాయక స్వామి లడ్డూ ప్రసాదం వేలం పాట నిర్వహించారు. ఈ లడ్డూ వేలం పాటలో ముదినేపల్లి ఎస్ఐ డి.వెంకట్‌కుమార్, సిబ్బంది పాల్గొని రూ.3,501కు దక్కించుకున్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయాలని మండలంలోని శ్రీహరిపురం గ్రామ సర్పంచి పరసా విశ్వేశ్వరరావు అన్నారు. శ్రీహరిపురం గ్రామ పరిధిలోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను సర్పంచి గురువారం తనిఖీ చేసి వారు అందిస్తున్న మెనూ నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న మెనూను ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి, విద్యా కమిటీ ఛైర్మన్ పాల్గొన్నారు.

రహదారులను పున:నిర్మిస్తాం : చింతమనేని

ప్రజాశక్తి - దెందులూరు

భారీ వర్షాలు, ఆకస్మిక వరదల వల్ల దెందులూరు నియోజకవర్గంలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు, పున:నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక గ్రామంలో దెబ్బతిన్న ప్రధాన రహదారులను గురువారం సాయంత్రం ప్రభుత్వ అధికారులు, స్థానిక కూటమి నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. దెబ్బతిన్న రహదారుల నిర్మాణాలు సత్వరమే పూర్తి చేయాలని ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ఆర్అండ్‌బి అధికారులకు సూచించారు. ఏలూరు-గుడివాక లంక ప్రధాన రహదారికి రూ.60 లక్షలతో అంచనాలు సిద్ధం చేసి శుక్రవారం నుంచే పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు.

పలుచోట్ల పౌష్టికాహార మాసోత్సవాలు

ప్రజాశక్తి - ముసునూరు

గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రం నుంచి అందించే పౌష్టికాహారం తీసుకోవాలని సిడిపిఒ ఎస్ఐ నూరానీ తెలిపారు. మండలంలోని చక్కపల్లి అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచి తల్లిబోయిన రాధిక సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి, బిడ్డ క్షేమంగా ఉండాలంటే ఐరన్ లోపం లేకుండా ఉండాలన్నారు. పప్పు దినుసులు ఎక్కువాడా వాడాలని తెలిపారు.

మండవల్లి :పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సిహెచ్‌వి.నాగలక్ష్మి స్పష్టం చేశారు. పౌష్టికాహార మహోత్సవాల భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహార లోపం వల్ల కిశోర బాలికల్లో ఆరోగ్య సమస్యలు తాయని అన్నారు. రక్తహీనత, ఎనీమియా వంటి వ్యాధులకు గురి కాకుండా ఉండాలంటే తప్పనిసరిగా బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగా హన పెంచుకోవాలని, ఎక్కడైనా బాల్యవివాహాలకు పాల్పడితే సమాచారం అందించాలని కోరారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై కిశోర్ బాలికలకు అవగాహన కల్పించారు. అనంతరం మెడికల్ సిబ్బంది కిశోర్ బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు.

టి.నరసాపురం :బాలికలు పౌష్టికాహారం ఎక్కువగా తీసుకోవడం ద్వారా రక్తహీనత నిర్మూలించొచ్చని సిడిపిఒ పి.మాధవి సూచించారు. పౌష్టికాహార మాసోత్సవంలో భాగంగా అంగన్వాడీ, ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం స్థానిక జెడ్‌పి హైస్కూల్లో రక్తహీనత, పౌష్టికాహారం, బెటి బచావో బేటీ పడాఒ కార్యక్రమాలపై అవగాహనా కార్యక్రమం, సైకిల్ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు వైద్య సిబ్బంది రక్తశాతం పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాధవి, సూపర్‌వైజర్ లక్ష్మి మాట్లాడుతూ బాల్యం నుంచి ఆకుకూరలు, ఐరన్ కలిగిన పౌష్టికాహారం ఎక్కువగా తీసుకోవాలన్నారు.

కామవరపుకోట :గర్భిణులు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసిడిఎస్ తడికలపూడి క్లస్టర్ సూపర్ వైజర్ ఎన్.వీరకుమారి అన్నారు. తడికలపూడిలోని అంగన్వాడీ కేంద్రం-140లో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులకు స్థానిక దాతల సహకారంతో సామూహిక సీమంతాలు నిర్వహించారు.

కుక్కునూరు : ఇంజరం పంచాయతీ పరిధిలో అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో గురువారం పౌష్టికాహార మహోత్సవాలను నిర్వహించారు. సీమంత, అన్నప్రాసన కార్యక్రమాలను అంగన్వాడీ సెక్టర్ సూపర్‌వైజర్ కె.మయూరి నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, గ్రామస్తులకు పోషణ ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు

ద్వారకాతిరుమల : మండలంలోని ఎం.నాగులపల్లి గ్రామ సచివాలయ పరిధిలో ఐసిడిఎస్ జంగారెడ్డిగూడెం ప్రాజెక్టు గోపాలపురం సెక్టార్‌లో భాగంగా పోషణ మహోత్సవంలో భాగంగా గురువారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిడిపిఒ పి.బ్యూలా హాజరై గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం తదితర విషయాలపై వివరించారు. సెక్టార్ సూపర్‌వైజర్ కె.మణి ఆధ్వర్యంలో సారే, చీర, పండ్లతో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు.

డాక్యుమెంట్స్ పోయినవి

వైట్ల సుధీప్ అను నేను అత్తిలి మండలం, అత్తిలిలో డో.నెం.16-91/1లో నివసిస్తున్నాను. ది.10-9-24న తణుకులో **రిజిష్టర్డు పార్టీషన్ డీడ్ నెం.6384/2022** జిరాక్సు కాపీలు తీయించుకుని తణుకు నుండి అత్తిలి వెళ్ళుచుండగా నా ఒరిజినల్ పార్టీషన్ డీడ్ డాక్యుమెంట్స్ తణుకు మార్గమధ్యలో పడిపోయినవి. చుట్టు ప్రక్కల ఎంత వెదకిననూ దొరకలేదు. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

వైట్ల సుదీప్
తండ్రి: కనక వెంకట అప్పారావు,
డో.నెం.16-91/1, సబ్‌రిజిష్టర్ కార్యాలయం వద్ద,
అత్తిలి, అత్తిలి మండలం, ప॥గో॥జిల్లా.

డాక్యుమెంట్ పోయినది

ముత్యాల విజయ ప్రకాష్, తండ్రి: త్రిమూర్తులు, డి.నెం.4-5, మెయిన్‌రోడ్, బల్లిపాడు, అత్తిలి మండలం నాకు సంబంధించిన కానూరు అగ్రహారం గ్రామం పొలం దస్తావేజులు 0-14 సెంట్లు, ఆర్ఎస్ నెం.1/132 మరియు 0.52 సెంట్లు, ఆర్ఎస్ నెం.213 మొత్తం 0.66 సెంట్లు డాక్యుమెంట్ నెం.పి212/2017 బల్లిపాడు నుండి అత్తిలి వెళ్ళుచుండగా మార్గమధ్యంలో పడిపోయినవి. ఈ డాక్యుమెంట్లు ఎవ్వరికైనా దొరికినయెడల దయచేసి ఈ క్రింది నెంబరుకు తెలుపగలరు.
సెల్: 99599 59399

డాక్యుమెంట్స్ పోయినవి

వెలగల వెంకట ధనలక్ష్మీ అను నేను అత్తిలి మండలం, ఆరవల్లి గ్రామంలో డో.నెం.2-27/ఎ, నివసిస్తున్నాను. ది.10-09-2024వ తారీకులో **రిజిష్టర్డ్ సేల్ డీడ్ నెం.1733/2016** జిరాక్సు కాపీలు తీసుకుని ఆరవల్లి వెళ్ళు తుండగా తణుకు మార్గమధ్యలో నా ఒరిజినల్ సేల్ డీడ్ డాక్యుమెంట్సు పడిపోయినవి. చుట్టు ప్రక్కల ఎంత వెదకినా దొరకలేదు. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

వెలగల వెంకట ధనలక్ష్మీ
భర్త: శివరామకృష్ణారెడ్డి,
డో.నెం.2-27/ఎ, కోలపువారి వీధి,
ఆరవల్లి, అత్తిలి మండలం, ప॥గో॥జిల్లా.

In The Court Of The Additional Senior Civil Judge, Eluru
E.P.No.11/2024 in O.S.No.259/2026
Between:
Korada Jagan Mohana Rao ***...Petitioner /D.H.R***
P.V.V.S.Manikyala Rao (Died) & 3 Others ***...Respondents /J.D.R's***
J.D.R-2: Peddireddy Padmavathi, W/o. Late P.V.V.S. Manikyala Rao, R/o. D.No.4-9/1, Near Ramalakshmi Brick Company, Pedavegi Village & Mandal, W.G.Dist.
J.D.R-3: Peddireddy Rajya Lakshmi, D/o. Late P.V.V.S. Manikyala Rao, R/o. D.No.4-9/1, Near Ramalakshmi Brick Company, Pedavegi Village & Mandal, W.G.Dist.
J.D.R-4: Peddireddy Deepika, D/o. Late P.V.V.S. Manikyala Rao, R/o. D.No.4-9/1, Near Ramalakshmi Brick Company, Pedavegi Village & Mandal, W.G.Dist.
పై నెంబరు ఇ.పి.లో 2 టు 4 జె.డి.ఆర్స్ అయిన మీకు ఎన్ని పర్యాయములు శ్రీ కోర్టు వారు నోటీసులు పంపించిననూ మీకు అమలు జరగని కారణంచే ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసులు అమలుకు ఉత్తర్వులు ఇచ్చినారు. సదరు ఇ.పి వాయిదా తేదీ **ది.15-10-2024న ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు గాని మీ అడ్వకేట్ గారి ద్వారా గారి హాజరు కాగలరు.** లేని ఎడల ఇ.పి. మీ పరోక్షముగా విచారణ జరపబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఎం.కేదారి,
డి.వి.అప్పారావు, అడ్వకేట్స్,
ఏలూరు, ఆర్.ఆర్.పేట, ఏలూరు.
18-9-24. సెల్: 94401 11127

వేలం ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No.13 of 2022 in O.S.No.22 of 2021
బిట్వీన్:
ఇందుర్తి అనురాధ **...పిటీషనరు /డి. హెచ్.ఆర్ /వాది**
అండ్
పిట్టల రాజేష్ **...రెస్పాండెంటు /జె.డి.ఆర్ /ప్రతివాది**
పై నెంబరు వారంటు గ్రంధములో డి.హెచ్.ఆర్.కి రావలసిన డిక్రీ బాకీని, ఖర్చులు మరియు వడ్డీతో సహా రాబట్టుకొనుటకు గాను, జె.డి.ఆర్. స్వాధీనంలో గల ఇ.పి. షెడ్యూలు స్థిరాస్థిని **ది.03-10-2024 సం॥రం తేదీన ఉదయం గం॥10:30 ని॥ల లగాయతు పై కోర్టు వారి ఎదుట వేలం పాట వేయబడును.** కావున వేలం పాటలో పాల్గొనదలచిన వారు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై వేలం షరతులు తెలుసుకొని వేలం పాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును.
షెడ్యూలు ఆస్తి వివరం
పశ్చిమ గోదావరి జిల్లా, మొగల్తూరు మండలం, మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో చేరిన మొగల్తూరు రెవిన్యూ విలేజీ, మొగల్తూరు గ్రామ పంచాయితీ ఏరియాలోని రి.స.నెం.722/1ఎ/1, ప్రస్తుత రి.స.నెం.722/1లో ఆర్.సి.సి. రూఫ్ బిల్డింగు, డో.నెం.4-189 రులో చ॥గ॥220 గల స్థలమున్ను అందులోని బిల్డింగుకు హద్దులు: **తూర్పు:** గ్రామ పంచాయితీ రోడ్డు 37-03 అ॥లు. **పడమర:** గెద్దాడ హనుమంత రావు గారి ఆస్తి 31-09 అడుగులు. **దక్షిణం:** శ్రీరామాలయం భూమి. **ఉత్తరం:** జంపన శ్రీనివాస రాజు భూమి 30-00 అ॥లు.
ఈ హద్దుల మధ్య చ॥గ॥220 గల స్థలమున్ను అందులోని ఆర్.సి.సి.రూఫ్ బిల్డింగున్ను సదరు బిల్డింగు అంటియున్న యావత్తు గృహోపకరణములతో సహా వేలం కావలసియున్నది.
డి.హెచ్.ఆర్. విలువ : రూ.15,00,000/-
అమీనా విలువ : రూ.22,00,000/-
శ్రీమతి కుంచె దుర్గా భవాని
నరసాపురం, అడ్వకేట్, నరసాపురం
18-9-24. సెల్: 9063037773

దావా సమను
మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No: 8/2013
Between :
పసుపులేటి వీర మణికంఠ నాయుడు మరియొకరు ..... వాదులు
మరియు
పసుపులేటి వెంకటేశ్వర్లు మరియు ఇతరులు ..... ప్రతివాదులు (1 to11)
To
1.జయమంగళం పెదినేటిమ్మ ఎలియాస్ పెద్దింటినటమ్మ w/o ప్రభుదాస్..... 8వ ప్రతివాది
2. జయ మంగళం నాగరాజు S/o ప్రభుదాస్ 9 వ ప్రతివాది
3. జయమంగళం సంతోష్ కుమార్ S/o ప్రభుదాస్ ... 10 వ ప్రతివాది
4. జయ మంగళం వెంకన్న ఎలియాస్ వెంకటేశ్వర్లు S/o ప్రభుదాస్ 11 వ ప్రతివాది
8 to 11 ప్రతివాదులు R/o డోర్ నెంబరు 2-70, రామాలయం గుడి ఎదురు, పెనుమ లంక గ్రామం మరియు పోస్టు, మందవల్లి మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.
పై నెంబరు దావాను వాదులు దావా పరిహారంలు పొందు నిమిత్తం దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీరు 8 to11 ప్రతివాదులు అయివుండి యిందును గూర్చి మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమనులు పంపినప్పటికీ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పత్రికా ప్రకటన ద్వారా దావా సమనులు జారీ చేయవలసినదిగా శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు.ఇందు నిమిత్త మై మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల 18-10-2024వ తేది ఉదయం 10:30 ని. లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుప వలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.
// శ్రీ కోర్టు వారి అనుమతితో //
అద్దంకి.
18-09-2024 ఇట్లు
పంచాగ్నుల రమేష్, అడ్వకేట్
అద్దంకి, బాపట్ల జిల్లా
సెల్ : 9948788290